# తుపాను

ఊరికి మెరక పల్లాలు ఒక అందం. ఊరిని ఒరుసుకుని వాగు ప్రవహిస్తుంటే, అదే సిరి. పల్లపుప్రాంతానికి ఎగువగా, సిగ్గుల పెళ్ళికూతురులా తుంగదుబ్బుల్ని చాటుచేసుకొని మందమందంగా ముందుకి సాగిపోతున్న సన్నటి వాగుని ముచ్చటగా చూస్తూ నిలబడ్డాడు వేణు. మండు వేసవి అయినా ఆ సాయంకాలం అకస్మాత్తుగా చల్లబడి గాలి రివ్వున వస్తోంది.

"ఇదేం వేసవి! బహుశా, నాగార్జునసాగర్ సరస్సువల్ల కాబోలు, ఋతువే మారిపోయినట్టుంది" అనుకున్నాడు వేణు.

చేరువలో ఊరికంతా ఎత్తయిన మెరక దిబ్బమీద వెంచేసివున్న వేణుగోపాల స్వామివారి ఆలయంలోనించి గంటలు వినిపించాయి. ఆ గంటల కోసమే అతని నిరీక్షణ. కల్యాణి వచ్చి వుంటుంది. వేణు హృదయంలో వీణ మీటినట్టయింది. త్వర త్వరగా ఆలయం చేరాడు.

కల్యాణి గుడి మంటపం దగ్గిరికి వచ్చి నిలబడ్డది. ఓసారి చుట్టూ చూసింది.

'ఇక్కడ' అన్నాడు వేణు స్తంభంచాటునించి వస్తూ. చటుక్కున కల్యాణి వెనక్కి తిరిగిచూసింది. చప్పున తలదించుకుంది. బుగ్గలు కెంపులయాయి. దోసిలి లోని పారిజాత పుష్పాల్ని అతని చేతుల్లో పోసి చప్పున ముందుకి సాగింది.

"గంటకొట్టి పిలిచింది వెళ్ళిపోటానికేనా?"

కల్యాణి వెనక్కి తిరిగి అతన్ని క్రీగంట చూసింది. "పాపం, పిలిచింది తమరినేనా?" కొంటెగా అన్నాయి మిలమిల మెరిసే ఆమె కళ్ళు. ఇంతలోనే సిగ్గు ముంచుకొచ్చి నేలచూపులు చూసి, చరాలున దిగువకి దూసుకుపోయింది కల్యాణి. పారిజాతపు ఎరుపులా ఆ సిగ్గెంత ఆకర్షణీయంగా ఉంది! ఎక్కడలేని ఆ సిగ్గంతా రెండు రోజుల్లో తనది కాబోతోందనే కాబోలు. వేణు మధుర భావనలతో కల్యాణి కనిపించే వరకూ అలాగే చూస్తూ నిలబడ్డాడు. ఆమె మలుపు తిరగగానే ముందుకి సాగాడు.

గాలి రాను రాను ఎక్కువ కాసాగింది;

పొలాలకి వెళ్ళిన వాళ్లు ఇళ్ళకి మళ్లుతున్నారు.

వేణు నడిచి నడిచి రైల్వేస్టేషన్ చేరాడు. ఏదో గూడ్సుబండి వస్తోంది. ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళి బ్రిడ్జి ఎక్కాడు. బ్రిడ్జిమీదినించి చూస్తే ఊరంతా కనిపిస్తుంది. అప్పుడప్పుడు వేణు సాయంత్రాలు ఆ బ్రిడ్జిమీదే గడుపుతాడు. పల్లెటూరు స్టేషన్ కావటం వల్ల జనం ఎక్కువగా ఉండరు.

పెనుగాలి వీచింది.

కొంచెం బెదురుగా వేణు ఊరంతా కలియచూశాడు. ఇంచుమించు అన్నీ పూరిళ్ళు.పది పన్నెండు పెంకుటిళ్లు,మూడు నాలుగు డాబాలూ ఉంటాయి. పెద్దగా గాలి వీస్తే పూరిళ్ళు ఏమౌతాయో నని భయపడ్డాడు వేణు. ఆ భయంతోనే తూర్పువైపు చూశాడు.

రాంపేరు!

ఏదైనా భయంలేదుగాని వేణుకి రాంపేరంటే గడగడ. బెరుకుగా, చుట్టూఉన్న జీడితోటల్నీ అరటితోటల్నీ చూశాడు. దాళ్వాపంట కోతకి సిద్ధంగా ఉంది. ఇప్పుడే పెనుగాలేమిటి ! తాలూకా మొత్తంమీద ఓ డజను మురుగుకాలవ లున్నాయి. అంతే కాక, చుట్టుపక్కల జిల్లాలనించి వచ్చే మురుగునీరంతా ఆ తాలూకానించే సముద్రంలో కలుస్తుంది. ఈ మురుగు కాలవలకి ప్రభుత్వం రెండు కాజువేలు నిర్మిస్తే బాగుండును. ఈ విషయం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో భగవంతుడికే తెలియాలి.

టప టప చినుకులు పడసాగాయి.

ఆకాశం ఉరుముతోంది.

మెరుపులు మెరుస్తున్నాయి.

గాలి విపరీతంగా విజృంభిస్తోంది.

సందేహంలేదు. తుపాను! మండువేసవిలో తుపాను! రాంపేరు మురుగు కాలవ పాములా పడగెత్తుతోంది. అందాలకి ఆలవాలమైన వాగు అల్లరిగా జడిపిస్తోంది వేణు ఆందోళనతో బ్రిడ్జి దిగాడు. ఏమిటీ విపరీత పరిస్థితి. రెండు రోజుల్లో తన వివాహం. అది సవ్యంగా జరిగి కళ్యాణి తనదౌతుందా!

ఉదాసీనత వేణు వదనంపై నల్లకప్పు వేసింది. అన్యమనస్కంగా బ్రిడ్జి దిగి ఇంటివైపు నడిచాడు. కనపడ్డ చిన్నా పెద్దా "బాబోయ్, తుపాను వచ్చేట్టుంది" అంటూ ఏమీ తోచక కకావికలుగా పరిగెత్తుతున్నారు.

కసికొద్ది పెనుగాలి చెట్ల తలల్ని విరచి పారేస్తోంది. ఆ పైశాచిక క్రీడకి మద్దత్తు ఇస్తున్నట్లుగా ఆకాశం చప్పట్లు కొడుతూ వికటాట్టహాసం చేస్తోంది.

జనం ఇళ్ళలో దూరి తలుపులు బిగించుకోసాగారు. వేణు విచారంగా ఇల్లు చేరి కుర్చీలో కూలబడ్డాడు. కిటికీలోంచి జల్లు విసరికొడుతున్నా, తలుపులు మూయాలని అతనికి తోచలేదు. కిటికీల తలుపులు టప టప కొట్టుకుంటున్నాయి.

"కిటికీల తలుపులు వేసుకో బాబూ, తుపానులా ఉంది" అంది వేణుతల్లి గది లోకి తొంగిచూసి. 'ఊ' అన్నాడేకాని వేణు కదల్లేదు. తమది డాబా ఇల్లు. తలుపులు వేసుకుని హాయిగా కూర్చోవచ్చు. కాని ఊరు! ఊరంటే వేణుకి ప్రాణం, వేణంటే ఊరంతటికీ తలలో నాలుక. అతను బి. ఎస్సి. ప్యాసయాడని కాదు. ఎకరాలు ఉన్నాయని కాదు. పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు రాఘవయ్యకి కాబోయే అల్లుడని కాదు. వేణువులోంచి తియ్యని సంగీతం వెలువడట్టు వేణు అందరితో ఆప్యాయంగా మాట్లాడతాడు. కష్టపడి పని చేస్తాడు. కష్టాలు పంచుకుంటాడు.

గాలి ఈడ్చి కొడుతోంది.

వర్షం జోరున కురుస్తోంది.

పురుల్లో ధాన్యం ఏమౌతుందో! పాతర్లలో ధాన్యం ముక్కవాసనేస్తుందా? జీడితోటలు,అరటితోటలు, నిమ్మతోటలు, సర్వే తోటలు. రొంపేరు దయ తలుస్తుందా! రాత్రంతా వేణు మనసులో జోరీగల్లాంటి ఆలోచనలు. కలత నిద్రపోయి లేచాడు.

వర్షం తగ్గే సూచనలేదు. ఎక్కువౌతున్నట్లుంది. మీదు మిక్కిలి గాలి సత్తువ కొద్దీ రయియిన వీస్తోంది. రేడియోలో వాతావరణ సూచన మరింత భయపెడుతోంది. కాలకృత్యాలు త్వరగా తీర్చుకుని వేణు మూలనున్న గొడుగు తీసుకొని బయటికి వచ్చాడు. నలుగురైదుగురు యువకుల్ని, అయిదారుగురు పెద్దలైతుల్ని కూడగట్టు కున్నాడు గొడుగుల్లో తలలు దూర్చి అందరూ నిస్సహాయంగా ఏరువైపు చూస్తున్నారు. "పడమటి వాగువల్ల ప్రమాదం లేదు. అదెప్పుడూ ఇంతవరకూ పొంగలేదు. రొంపేరు మురుగే...." అర్థవంతంగా ఆగాడు ఒక యువకుడు వేణు వైపు చూస్తూ. "గట్లు ఒరుసుకు పారుతోంది. షట్టర్లు తెరిచినట్టు లేదు?" అన్నాడు వేణు ఆలోచనగా.

"సూపర్‌వైజరుగారి దయ" అన్నాడు రైతు. "పదండి" అన్నాడు వేణు అడుగు ముందువేసి, మలుపు తిరిగేసరికి వెదకబోయిన తీగ కాళ్లకి తగిలింది.

"అదుగో సూపర్‌వైజరుగారే ఇటు వస్తున్నారు. పక్కన మన సర్‌పంచ్ రాఘవయ్యగారూ ఉన్నారే!" ఒక రైతు దూరాన్నుంచే ఆనవాలు పట్టాడు.

ఒక చేత్తో గొడుగు ఎత్తిపట్టుకొని, రెండో చేత్తో కఱ్ఱ టక టక లాడిస్తూ రాఘవయ్య ఠీవిగా నడుస్తున్నాడు. అప్పుడప్పుడు, పక్కనే నడుస్తున్న పి.డబ్ల్యు.డి. సూపర్‌వైజరుతో ఏదో మాట్లాడుతున్నాడు.

ఇద్దరూ దగ్గరికి రాగానే రైతులు నమస్కారాలు చేశారు.

"ఏమిటి ఇలా వస్తున్నారు ? ఏం వేణు ఏమిటి సంగతి ? అకాలంలో ఈ తుపానేమిటో అంతా నాశనానికే వచ్చినట్టుంది" అన్నాడు రాఘవయ్య. బుఱ్ఱమీసాల మీద పడుతున్న జల్లు తుడుచుకుంటూ."మరేనండి" అన్నారు రైతులు. సూపర్‌వైజర్ గారు, "స్ట్రెయిట్ కట్‌కీ తలుపులు మూసే ఉన్నట్టున్నాయి"అన్నాడు వేణు సూటిగా. "అవును, షట్టర్లు తియ్యలేదు, ఇప్పుడే సర్‌పంచ్‌గారూ, నేను చూసివస్తున్నాం. ఇప్పట్లో ప్రమాదంలేదు" అన్నాడు సూపర్‌వైజర్ రాఘవయ్య వైపు చూసి."అదేమిటి సార్! ఊరూవాడా వర్షానికి జలమయమై పోతుంటే ! మురుగునీరు గ్రామాన్ని ముంచేదాక వస్తాయిస్తారేమిటి కొంపతీసి" కొంచెం దూకుడుగానే అన్నాడు వేణు. అది అతని స్వభావానికి విరుద్ధమే అయినా.

రాఘవయ్య కలగ చేసుకున్నాడు.

"తొందరపడి తలుపులు తెరిస్తే దిగువ భూములన్నీ మునిగిపోవా, వేణూ, ఆ మాత్రం వారికి తెలియదా?" "దిగువ భూముల కోసం చూసుకుంటే ఊరే ఊడ్చి పెట్టుకుపోతుంది, దయచేసి తలుపులు తెరిపించండి" వేణు నిష్కర్షగా అన్నాడు.

రాఘవయ్యకి అతనిధోరణి కొంచెం ఆశ్చర్యం, ఆగ్రహం కూడా కలిగించింది.

"కుఱ్ఱవాళ్ళకి ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. ఊరి సంగతి మాకేం పట్టదన్నమాట" అన్నాడు ఆయన. "క్షమించాలి. తుపాను సూచన నిరాశాజనకంగా ఉంది. రొంపేరు మీదపడితే ఇక ఎవరమూ ఏమీ చెయ్యలేము. దీపం వుండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి. తలుపులు తెరిపించండి."

"మా విధ్యుక్త ధర్మనిర్వహణలో మీరు కలగచేసుకోటం ఏమీ బాగుండలేదు"

అన్నాడు సూపర్‌వైజర్ కోపంగా. "మీ విధ్యుక్త ధర్మాన్ని మీరు సరిగా నిర్వహిస్తే ఎవడు మాత్రం ఎందుకు కలగచేసుకుంటాడు?"

"ఏమిటి మీ అభిప్రాయం?"

"మీరు లంచం తిన్నారు" అన్నాడు వేణు ఉద్రేకంగా. "వేణు!" అన్నాడు రాఘవయ్య హెచ్చరికగా. "మర్యాద ఇచ్చి పుచ్చుకోండి" అన్నాడు సూపర్‌వైజరు. "సరే ఆరోపణ అసత్యమని మీరు నిజంగా భావిస్తే క్షమాపణ కోరుకుంటాను. కాని గుండెమీద చెయ్యి వేసుకుచెప్పండి. కొందరు రాజకీయ వ్యక్తులకి ఆ ప్రాంతాల్లో భూములు కేటాయించారు. అవి మునిగిపోకుండా కాపాడటానికే కదూ, మీరు తలుపులు మూసుకొని కూర్చున్నది ? న్యాయం ధర్మం ఆలోచించండి" ప్రాధేయ పూర్వకంగా అన్నాడు వేణు. రాఘవయ్య ఉగ్రుడైనాడు.

"న్యాయం! ధర్మం! వేణూ ఈ నింద నేను సహించను. అక్కడ నాకు భూములు కేటాయించారని నీకు తెలుసు. నువ్వు ఇష్టం వచ్చినట్లు వాగినా పడి ఉండటానికి నువ్వింకా నా అల్లుడివి కాలేదని గ్రహించు."

వేణు పెదవులు కంపించాయి.

"కర్తవ్యానికీ, బాంధవ్యానికి చాలా దూరం ఉంది, క్షమించండి." రాఘవయ్య కోపంతో నిలువెల్లా వొణికాడు. "క్షమ! నలుగురిలో నన్ను అవమానించావు. తాహ తెరుగని భ్రష్టుడివి. ఛీ, నీ ముఖం ఇహ చూడను. ఈ క్షణమే నీతో తెగతెంపులు చేసుకుంటున్నా, మా కల్యాణి వైపు కన్నెత్తి చూశావో, తల పగిలిపోతుంది,జాగ్రత్త." రాఘవయ్య చర చర వెళ్ళిపోయాడు. ఈ హఠాత్సంభవమైన ఉపద్రవానికి అంతా ప్రమాన్పడిపోయారు. వేణు తనకి జరిగిన దేమిటో తెలుసుకొని నిర్జీవుడైపోయాడు. కాని కర్తవ్యం ముందుకి నెట్టింది. ఎలాగో తేరుకుని సూపర్‌వైజరు వైపు చూస్తూ అన్నాడు.

"సూపర్‌వైజరుగారూ, తలుపులు తెరిపించండి దయచేసి." "ఉత్తర్వులు లేవు. క్షమించాలి" అని సూపర్‌వైజరు అక్కడినించి కదిలాడు. వేణు పెదవి కొరికి "ఆ ఉత్తర్వులు నేనే ఇంజనీరుగారి దగ్గిర్నించి తీసుకొస్తాను"అన్నాడు దృఢ నిశ్చయంతో. ప్రక్కన ఉన్న రైతులు అతన్ని ఆ ప్రయత్నం నించి విరమింప చేయటానికి ప్రయత్నించారు. కాని వేణు నిశ్చయం మార్చుకోలేదు. వెంటనే పట్నం బయలు దేరాడు.

గాలివాన తగ్గుముఖం పట్టకపోగా క్రమంగా తీవ్రరూపం ధరించింది. ఒకటే కుండపోత. హోరుగాలి. తలుపు తెరిచి తొంగిచూస్తేనే ఈదురుగాలి ఫెడీమని చెంప మీద కొడ్తోంది. చెట్లు కూకటి వేళ్ళతో పెకలించుకొని వచ్చి రోడ్లమీద అడ్డంగా పడుతున్నాయి. పూరిగుడిసెల పై కప్పులు గాలికి ఎగిరిపోతున్నాయి. రాత్రి కాళరాత్రే అయింది. బ్రహ్మాండమైన వేగంతో వరద వచ్చి రొంపేరు ఊరిమీద బ్రహ్మరాక్షసిలా విరుచుకుపడ్డది. గోరుచుట్టుమీద రోకటి పోటనట్టు, ఎప్పుడూ వరద ఎరగని పడమటి ఏరు ఉధృతంగా పొంగి పల్లపు భూముల్ని ముంచివెయసాగింది. పైన కుంభవృష్టి, కింద నీటి మడుగులు, ఊపిరి సలపనివ్వని వేగంతో వేస్తున్న గాలి. ఏరు, వాగు ఏకమై ఇళ్ళలో జొరబడ్డాయి. పిల్లా పిచికా గోడుగోడున ఏడవసాగారు. ఇళ్ళు కూలి పోతుంటే చంటి పిల్లల్ని చంకన వేసుకుని ఆడవాళ్ళు అందిన సామాన్లు పుచ్చుకొని మొగవాళ్ళు ప్రాణాలు గుప్పిళ్ళలో పట్టుకొని సురక్షిత స్థానం చేరుకోటానికి పరుగెత్త సాగారు.

"బాబోయ్. ఏరు ముంచేస్తోంది. మా కొంపా గోడూ గోయిందా" అనే ఆర్త నాదాలే ఎటుచూసినా ప్రతిధ్వనిస్తున్నాయి. ఎందుకో ప్రకృతి కక్షగట్టి కసితీర్చు కొంటోంది. రాఘవయ్య ఇల్లు పెంకుటిల్లు. ఏయేటికాయేడు డాబా వేయించాలను కుంటూనే ఉన్నాడు. ఏదో అవాంతరం వస్తోంది. పూర్వీకులు కట్టిన ఇల్లు పడగొట్టా లంటే అంతరాంతరాలలో కలిగే వైముఖ్యం కూడా అందుకు కారణం కావచ్చు. ఇల్లంతా శిథిలావస్థలో ఉంది. బాగుచేయించాలంటే, ఎలాగో పడగొట్టే ఇల్లే అనే ఉపేక్షాభావం కలిగేది. ఇంటికప్పంతా చిల్లులుపడి జలాజంతరగా కురవసాగింది. పెంకులు ఎగిరిపోతున్నాయి. చౌడుపట్టిన గోడలు నీటికి తడిసి పెళ్ళలు పెళ్ళలుగా పడిపోసాగాయి. పల్లపు ప్రాంతం కావటంవల్ల ఇంట్లోకి అడుగులోతు నీళ్ళు చేరాయి. ఆ రాత్రి ఇల్లు నిలిచేటట్టులేదు. నిలిచినా ఆ అడుగులోతు నీళ్ళల్లో ఎలా ఉండటం ! ఇలా ఆలోచిస్తుండగానే పెనుగాలి వీచి దక్షిణంవైపు భాగం కుప్పగా కూలింది. ప్రాణాలు అరచేతుల్లో పట్టుకుని భార్యతో, కుమార్తె కళ్యాణితో గుడివైపుకి రాత్రికి రాత్రి బయలుదేరాడు. అంతా చిమ్మచీకటి. ఒక చెంపన శోష వస్తోంది. రోజంతా కటిక ఉపవాసం. పొయ్యిలో పిల్లిలేచే ప్రశ్నలేదు కదా !

'ఇదంతా రొంపేరు మురుగేనా నాన్నా ?' అంది కల్యాణి అమాయికంగా.

రాఘవయ్యకి చుర్రుమంది. కాని తమాయించుకున్నాడు. తను పెద్ద పొరపాటే చేశాడు. ఎందుకలా దుర్బుద్ధి పుట్టింది? తన స్వార్థంవల్లే ఊరు ఊరంతా మునిగి పోతోంది. తనకు పుట్టగతుల్లేవేమో! వేణుతో లేనిపోని తగవు తెచ్చుకున్నాడు! కల్యాణికి అతనంటే ప్రాణం. దాని భవిష్యత్తు ఏమిటో! వేణుకి అంత కరకుదనం ఎలా వచ్చింది? నలుగురిలో అవమానిస్తాడా! రాఘవయ్యకి హృదయం కరడు గట్టింది. హుఁః, ఏమైనా అతనితో కల్యాణి పెళ్ళి జరగటానికి వీల్లేదు—తన బొందిలో ప్రాణం ఉండగా!

ఎలాగో నానావస్థలూ పడి ముగ్గురూ ఆలయం చేరుకున్నారు. ఆలయం ఆవరణలోకి కూడా నీరు వచ్చింది. ఎత్తుగా వున్న మంటపంలో కూలబడ్డారు ఉస్సురంటూ. అప్పటికే కొంతమంది జనం వచ్చి చేరారు. చంటిపిల్లలు ఒకటే గోల! ఎవరికీ తిండీ తిప్పలూ లేవు.

తెల్లవారింది.

తుపాను తగ్గే సూచన ఏమీ లేదు. వర్షం ముమ్మరంగా పడుతూనే ఉంది. గాలి పటాటోపం ఆవంతైనా తగ్గలేదు. ఎటు చూసినా నీళ్ళు. మహాసముద్రం!

ఆకలితో అందరూ అలమటించి పోతున్నారు. ఆహారం దొరకటం అసంభవం. కల్యాణి శోష వచ్చినట్టు పడుకొంది. పిల్లలు నిస్సత్తువతో ఏడ్చే ఓపిక కూడా లేక పడివున్నారు. కల్యాణిని చూస్తుంటే రాఘవయ్యకి బెంగ ఎక్కువైంది. ఆమె వదనం బాగా వన్నెతరిగి పీక్కుపోయింది. బుగ్గలమీద నీరు వానజల్లేనా! రాఘవయ్యకి నమ్మకం కుదరలేదు. పొరపాటు చేశాడు. ఇంట్లో అనకుండా ఉండవలసింది. కోపం కొద్ది భార్యతో వేణువిషయం చెప్పాడు. అతని సంబంధం వదులుకొన్నట్టు నిష్కర్షగా చెప్పాడు. ఆమె విస్తుపోయింది. ఏదో అనబోయింది. కాని తను కఠోరంగా మాట్లాడే సరికి నోరు మూసుకుంది. అదంతా కల్యాణి వింటూనే ఉన్నదని తనకు తెలుసు. వినాలనే గట్టిగా మాట్లాడాడు కూడా. అప్పటినించే కల్యాణి జీవచ్ఛవంలా తయారయింది. రాఘవయ్యకి విసుగ్గా ఉంది. ఒక వంక తుపాను. ఇల్లు కూలింది. తోటలు నాశనమయాయి. వేరొకవంక వేణుతో ఏర్పడిన స్పర్థ. కల్యాణి గురించి దిగులు. సాయంకాలమైంది. చీకటి పడ్డది. రాత్రి మరో కాళరాత్రి. నిద్రాహారాలు లేవు. తెల్లారేసరికి ఎవరు ప్రాణాలతో ఉంటారో అనుమానం.

ఎలాగో తెల్లవారింది.

నీరసంగా, మత్తుగా పడుకొని నిద్రలాంటి అవస్థ అనుభవిస్తున్న రాఘవయ్య నెమ్మదిగా కళ్ళువిప్పి చూశాడు. నమ్మశక్యం కానిదేదో చూస్తున్నట్లు గుచ్చి గుచ్చి చూశాడు. వర్షం ఆగిపోయింది. ఏనుగంత బలం వచ్చినట్టయింది. లేచాడు. తూలి పడబోయి తట్టుకున్నాడు.

తుపాను ఆగిపోయింది.

అంతా ప్రశాంతంగా ఉంది. స్మశానంలోని ప్రశాంతత. ఎటుచూసినా నీళ్లు నీళ్లు! భార్యని లేపాడు. ఆమె ఓపికంతా కూడదీసుకుని లేచింది. గుడిలోని జనం నెమ్మదిగా లేవసాగారు. పిల్లల్ని లేపటానికి ఎవరికీ ధైర్యం చాలటంలేదు.

"కల్యాణీ, కల్యాణీ !"

కల్యాణి ఓసారి నీరసంగా కళ్లు సగం విప్పి, మళ్ళీ మూసుకుంది. రాఘవయ్య కళ్ళల్లో నీళ్ళు నిండాయి.సరిగా ఈఉదయమే ముహూర్తం. పెళ్ళికూతురై సింగారంతో ముచ్చట గొలపవలసిన కల్యాణి! తినటానికి తిండి కూడా లేక మనోవ్యథతో నేలని కరచుకొని పడుకుని ఉంది. విందు భోజనాలు ఏర్పాటుచేసి, బలవంతాన కొసిరి కొసిరి విస్తళ్ల నిండా రకరకాల పిండివంటలు వడ్డిస్తుంటే ఆనందంగా అజమాయిషీ చేయవలసిన తను ఎవరికీ గుప్పెడు మెతుకులు పెట్టలేకపోగా, అన్నం మెతుకులకి తనే మొహం వాచినట్టు ఎదురు చూడవలసి వచ్చింది! దుర్ముహూర్తం! ముహూర్తాన్ని అనటమెందుకు! తను షట్టర్లు తెరిపిస్తే ఎలా ఉండేదో! అన్నట్లు వేణు ఎక్కడున్నాడో! ఉత్తర్వులకోసం పట్నం బయల్దేరి వెళ్ళాడట! ఎక్కడ చిక్కుకు పోయాడో! ప్రమాదం ఏమీ జరిగి ఉండదుగద! రాఘవయ్య హృదయం చివుక్కుమంది.

ఆకాశంలో ఏదో శబ్దమై అందరూ బయటికి వచ్చి చూశారు. విమానం !

"విమానం, విమానం" అని కేకలు పెట్టారు.

ఏదో ఆశతో చేతులెత్తారు. చప్పట్లు కొట్టారు.

అప్రయత్నంగా రాఘవయ్య రెండు చేతులూ పైకెత్తాడు.

విమానం చాలా కిందగా వస్తోంది.

అందరి ముఖాల్లో ఏదో వింత సంతోషం.

"విమానంలోంచి ఏదో జార విడుస్తున్నారు." అని కేకలు వేయసాగారు.

"అన్నం పొట్లాలు ! అన్నం పొట్లాలు." ఆశగా అరిచారు. అందినన్ని పట్టు కోటానికి జాగ్రత్తగా అందరూ చేతులు చాచారు. అభిమానం విడిచి రాఘవయ్య పై పంచ చాపాడు-యాచకుడిలా.

గుడి ఆవరణలో పొట్లాలు పడ్డాయి. అందరి ముఖాల్లో ఆనందం తాండ వించింది. ఎక్కడెక్కడ పడ్డవీ జాగ్రత్తగా ప్రోగు చేస్తున్నారు. పొట్లాలు అందని ఒక వృద్ధుడికి రాఘవయ్య తన పొట్లం ఒకటిచ్చాడు.

"ఎందుకులే నాయనా కాటికికాళ్లు చాచుకున్నవాడిని, ఏ పిల్లవాడికైనా పెట్టండి." అన్నాడతను.

"ఫరవాలేదులే తాతా తిను" అన్నాడు రాఘవయ్య చెమ్మగిల్లిన కళ్ళతో.

"కాలం కర్మం బాగుంటే ఇవాళ మీ యింట్లో పెళ్లిభోజనం చేయవలసినవాడిని - పోన్లే నీ చేత్తోనే అన్నం పొట్లం ఇస్తున్నావు" అన్నాడు వృద్ధుడు. రాఘవయ్య కుప్పగా కూలిపోయాడు. "అంతా వేణుగోపాలస్వామి దయ" అంటూ ఒక రైతు భక్తితో ఆలయం గంట మ్రోగించాడు.

"కల్యాణీ" అని ఎవరో పిలిచినట్టయి కల్యాణి దిగ్గునలేచి కూర్చుంది, చుట్టూ చూసింది. అంతా ఏవో తింటున్నారు. ఆమెకి సరిగా అర్థం కాలేదు. రాఘవయ్య చేతిలో అన్నం పొట్లం పట్టుకుని "తినమ్మా" అన్నాడు ఆప్యాయంగా. ఆమె ముఖం తిప్పింది. లేవటానికి ప్రయత్నించింది. ఆమెని రాఘవయ్య పొదివి పట్టుకుని నిల బెట్టాడు.బలహీనమైన చెయ్యి బలవంతంగా ఎత్తి కల్యాణి సత్తువకొద్దీ గంట కొట్టింది. కళ్ళు తిరిగాయి, ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

"పాపం ! అమ్మాయికి వేణుగోపాలస్వామి అంటే మహాభక్తి" అన్నా రెవరో, ఆ సంకేతం అర్థం చేసుకోగల వ్యక్తి ఒక్కడే. కాని షట్టర్లు తెరవాలని ఆదే శించే ఉత్తర్వుతోసహా రాంపేరు అంతకు ముందే అతన్ని బిగికౌగిలిలోకి లాక్కుంది.

[తెలుగు విద్యార్థి, జూన్ 1970]